సాక్షి
నల్లగొండ

శనివారం : 2 : నవంబర్ : 2024



దంపతుల దుర్మరణం

చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం పాలయ్యారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	589.20 అడుగులు
ఇన్‌ఫ్లో	7,102 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	48,602 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	29,273 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	9,500 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	7,029 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	2,400
వరద కాల్వకు	400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	643.60 అడుగులు
ఇన్‌ఫ్లో	678 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	1298 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	48 క్యూసెక్కులు
కుడికాల్వకు	96 క్యూసెక్కులు



సదర్ ఉత్సవం

దీపావళి పర్వదినం సందర్భంగా నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో గురువారం రాత్రి నిర్వహించిన సదర్ సమ్మేళనంలో దున్నపోతు విన్యాసాలు, చూసేందుకు హాజరైన ప్రజలు

న్యూస్‌రీల్

4న రాష్ట్ర బీసీ కమిషన్ రాక

నల్లగొండ : రాష్ట్ర బీసీ కమిషన్ ఈనెల 4న నల్లగొండకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ తెలిపారు. శుక్రవారం ఆమె తన చాంబర్లో అదనపు కలెక్టర్, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ నిరంజన్ అధ్యక్షతన సభ్యులు రాపోలు జయ ప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, వెనుకబడిన తరగతుల శాఖ కమిషనర్ నల్లగొండకు రానున్నట్లు కలెక్టర్ తెలిపారు. బీసీ కమిషన్ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నల్లగొండ జిల్లా, మధ్యాహ్నం 12 గంటల నుంచి 1.30 వరకు సూర్యాపేట జిల్లా, 2.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు యాదాద్రి భువనగిరి జిల్లాకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల వారీగా రిజర్వేషన్ల దామాషాపై అభిప్రాయాలను రాత పూర్వకంగా స్వీకరిస్తుందని పేర్కొన్నారు. అభిప్రాయాలను దరఖాస్తుతోపాటు, ప్రభుత్వం నిర్దేశించిన ప్రొఫార్మాలో (6) సెట్లను బీసీ కమిషన్‌కు సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఖాజా నజీమ్‌అలీ పాల్గొన్నారు.


బ్యాడ్మింటన్ క్రీడాకారులకు కలెక్టర్ అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్

నల్లగొండ టూటౌన్ : ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-17, 19 షటిల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీల్లో నల్లగొండ జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు అనిత్ నిహాల్‌రెడ్డి, శశాంక్ వనమాల, అకిలేష్‌గౌడ్, లాస్యను కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం కలెక్టరేట్‌లో అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై జిల్లాకు పేరు తేవడం గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరి దగ్గుపాటి విమల తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



హెల్త్ సబ్‌సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్

చిట్యాల : గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. చిట్యాల మండలం వెలిమినేడు పీహెచ్‌సీ పరిధిలోని గుండ్రాంపల్లి గ్రామంలోని హెల్త్ సబ్‌సెంటర్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రికార్డులు, వైద్య సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న పల్లె దవాఖాన భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఉబ్బు నర్సింహ, ఏఎన్‌ఎం హేమలత, మల్లమ్మ, సాయివాణి పాల్గొన్నారు.

చెర్వుగట్టులో లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా స్వామివారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయం గట్టుపైన ఉన్న కోనేరులో స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు రామలింగేశ్వరశర్మ, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, శ్రీకాంత్ శర్మ, సురేష్ శర్మ, సతీష్‌శర్మ తదితరులు ఉన్నారు.

కులగణనకు సన్నాహాలు

6వ తేదీ నుంచి సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే

- ఎన్యూమరేటర్లుగా టీచర్లు.. కొనసాగుతున్న శిక్షణ
- పాఠశాల విధులకు ఆటంకం కలగకుండా ఏర్పాట్లు
- పది మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్
- ప్రతి మండలానికో నోడల్ అధికారి
- 56 అంశాలపై వివరాల సేకరణ
- స్థానిక రిజర్వేషన్లు, పథకాల అమలుకు ఉపయోగపడనున్న సర్వే



సర్వేపై మండల స్టాటిస్టికల్ అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి రాజకీయ, కుల సర్వేకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఎన్యూమరేటర్లుగా విధులు నిర్వర్తించే సిబ్బందికి శిక్షణ ఇస్తోంది. ఈనెల 6వ తేదీ నుంచి సర్వే ప్రారంభం కానుంది. దాదాపు ఐదు వేల సిబ్బంది ఈ సర్వేలో పాల్గొననున్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ మేరకు ప్రభుత్వం ఈ సర్వేకు శ్రీకారం చుట్టింది. సర్వే ఆధారంగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఖరారు చేయడంతోపాటు భవిష్యత్‌లో ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపికకు ఉపయోగించుకునేలా సర్వే చేపట్టింది.

మొదలైన ఇళ్ల లెక్క..

2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 5,02,000 ఇళ్లు ఉండగా 34,88,809 జనాభా ఉంది. వీరిలో హిందువులు 32,49,231 మంది ఉండగా, అందులో ఎస్సీలు 6,37,385 మంది, ఎస్టీలు 3,94,279 మంది ఉన్నారు. మిగతా వారు ఇతర కులాలు, మతాలకు చెందిన వారు ఉన్నారు. 2011 తరువాత జనాభా లెక్కలు పూర్తిస్థాయిలో చేపట్టనందున ప్రస్తుతం చేపట్టే సర్వే ఆధారంగా జనాభా లెక్కలు తేలనున్నాయి. ఇందులో భాగంగా ప్రస్తుతం జిల్లాలో ఎన్ని ఇళ్లు ఉన్నాయనే వివరాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా యంత్రాంగం ప్రారంభించింది. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని కొనసాగించనుంది. ఇందులో గ్రామాల వారీగా వివరాలను సేకరించనున్నారు. అలాగే గ్రామాలు, మండలాల వారీగా ఎన్ని గృహాలు ఉన్నాయనే వివరాలను కూడా ఈ మూడు రోజుల్లో సేకరించనున్నారు. ఇళ్ల సంఖ్య తేలిన అనంతరం ఆ సంఖ్య ఆధారంగా సిబ్బందికి విధులను కేటాయించేలా కసరత్తు చేస్తోంది. 6వ తేదీ నుంచి సర్వే మొదలు కానుంది.

ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150 ఇళ్లు..

సర్వేలో దాదాపుగా ఐదు వేల మంది సిబ్బంది పాల్గొననున్నారు. వారిలో ఒక్కొక్కరికి 150 ఇళ్లలో సర్వే చేసే బాధ్యతలను అప్పగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక వీధిలో 10 -20 ఇళ్లు ఎక్కువగా ఉన్నా వారికే వాటిని కేటాయించే అవకాశం ఉంది. ఎన్యూమరేటర్లుగా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. పాఠశాలలకు ఇబ్బంది కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తూ సర్వే కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తోంది. టీచర్లతో పాటు ఇతర శాఖల సిబ్బందికి కూడా విధులు కేటాయించే అవకాశం ఉంది. మరోవైపు పర్యవేక్షణ కోసం ప్రతి పది మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించాలని నిర్ణయించింది. దాంతో పాటు ప్రతి మండలానికి ఒక జిల్లాస్థాయి అధి కారిని మండల నోడల్ ఆఫీసర్‌గా నియమించనుంది.

సమగ్ర వివరాల సేకరణ..

ఒక్కో కుటుంబానికి సంబంధించిన ప్రధానంగా 56 అంశాలకు సంబంధించిన వివరాలను సేకరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వాటితోపాటు ఇతరత్రా వివరాలను కూడా అందులో పొందుపరిచింది. యజమాని పేరు, కుటుంబంలోని సభ్యులు, యజమానితో ఉన్న సంబంధం, సామాజిక వర్గం కేటగిరీ, కులం, ఇతర పేర్లు, మాతృభాష, భూమి ఉందా? ధరణి పాస్‌బుక్ ఉందా? ఉన్న భూమి పట్టానా? అసైన్డ్ భూమా, అటవీ భూమినా, భూమి రకం, నీటి వనరు, కౌలు చేస్తే రైతు వివరాలు, ఎన్ని ఎకరాల్లో చేస్తున్నారు? ఏదైనా ప్రజాప్రతినిధిగా పని చేస్తున్నారా? గతంలో చేశారా? ఎన్నిసార్లు చేశారు? వలసకు సంబంధించిన వివరాలు, కుటుంబ ఆస్తులు, ఇల్లు ఉందా? లేదా? ఏయే వాహనాలు ఉన్నాయి. రేషన్‌కార్డు ఉందా? లేదా వంటి సమగ్ర వివరాలను సేకరించనుంది.



2011 లెక్కల ప్రకారం జిల్లాలో జనాభా వివరాలు..

హిందువులు	ముస్లింలు
32,49,231	1,88,646
క్రిస్టియన్లు	సిక్కులు
35,025	937
బౌద్ధులు	జైనులు
241	250
ఇతరులు	కులం చెప్పనివారు
130	14,349

సర్వే ఎలా చేయాలంటే..

సర్వే ఎలా చేయాలన్న దానిపైనా జిల్లా యంత్రాంగం ఎన్యూమరేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. ఒక్కో ఇంట్లో ఎన్ని కుటుంబాలు ఉంటున్నాయి.. ఉమ్మడి కుటుంబాల్లో ఉండేవారు వేర్వేరు కుటుంబాలుగా నమోదు చేయించుకోవాలని చూస్తారని, ఇంటి పెద్ద ఇచ్చిన సమాచారం ఆధారంగా కుటుంబాన్ని నిర్ణయించాలని ఎన్యూమరేటర్లకు స్పష్టం చేసింది. సర్వే మొదలుపెట్టిన తర్వాత కొత్త కుటుంబం తెరపైకి వచ్చే పరిస్థితి రాకుండా చూసుకోవాలని చెబుతోంది. ఇంట్లోని కుటుంబ యజమానుల ఫోన్ నంబర్లు తీసుకోవాలని పేర్కొంటోంది. ఒక కుటుంబంలో పదిమంది కంటే ఎక్కువ సభ్యులు ఉంటే రెండో ఫారాన్ని నింపాలని సూచించింది. కుటుంబంలోని పిల్లలు ఉన్నత చదువు, ఉద్యోగం, పెళ్లి, వ్యాపారం కోసం వలస వెళితే వారి వివరాలు, వారు వెళ్లిన దేశం, లేదా రాష్ట్రం వివరాలు పక్కాగా సేకరించాలని ఎన్యూమరేటర్లకు సూచిస్తోంది.



కట్టంగూర్‌లో ఇళ్ల లెక్క సేకరణను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

సర్వేకు అందరూ సహకరించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు అందరూ సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. సమగ్ర కుటుంబ సర్వే విషయమై శుక్రవారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సర్వే నిర్వహించే ఎన్యూమరేటర్లు పకడ్బందీగా వివరాలు సేకరించాలన్నారు. ప్రతి ఎన్యూమరేటర్ వద్ద ఎన్యూమరేషన్ మ్యాపు, స్టిక్కర్, ఇండ్ల జాబితా ఉండాలన్నారు. మున్సిపల్ ప్రాంతాలలో నిర్దేశించిన ఎన్యూమరేటర్లతోపాటు, రిజర్వులో మరికొంతమందిని సిద్ధంగా ఉంచాలన్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలు, ఎన్యూమరేటర్ల సర్వేను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, సీపీఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓలు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ టూటౌన్ : ప్రభుత్వం నిర్వహించనున్న సామాజిక, కుల, ఆర్థిక, రాజకీయ సర్వేను పారదర్శకంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం నీలగిరి మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటిలో నివాసం ఉంటున్న కుటుంబ సభ్యుల అందరి వివరాలు సమగ్రంగా సేకరించాలని కోరారు. ప్రొఫార్మాలు పొందుపరిచిన అన్ని వివరాలు తీసుకోవాలని, ఎక్కడా తప్పులకు ఆస్కారం ఉండొద్దన్నారు. సమావేశంలో ఆర్డీఓ అశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సర్వే సామగ్రి అందజేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నేడు డీసీసీ విస్తృత స్థాయి సమావేశం

- హాజరుకానున్న మంత్రి కోమటిరెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు

నల్లగొండ : కాంగ్రెస్ కమిటీ విస్తృతస్థాయి సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నిర్వహించనున్న కులగణన, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకి సంబంధించి ఈ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బాలునాయక్, కుందూరు జైవీర్‌రెడ్డి, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, డీసీసీబీ చైర్మన్, డీసీఎంఎస్ చైర్మన్, కార్పొరేషన్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బుద్ధవనంలో స్టార్ హోటల్



జలాశయతీరాన్ని పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, దాజి తదితరులు

- ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తాం
- రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగార్జునసాగర్ : రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో బుద్ధవనం పరిసరాల్లో స్టార్ హోటల్‌తోపాటు వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శుక్రవారం ఆయన నాగార్జునసాగర్ జలాశయతీరంలో నిర్మితమైన బుద్ధవనాన్ని శ్రీరామచంద్రమిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కమలేష్ డి.పాటిల్(దాజి), స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ముందుగా విజయవిహార్‌కు వచ్చిన మంత్రికి.. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి విజయవిహార్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. బుద్ధవనం, విజయవిహార్ లే ఔట్లను పరిశీలించారు. మొత్తం 270 ఎకరాల విస్తీర్ణంలోని బుద్ధవనం విశేషాలను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, బుద్ధవనం కన్సల్టెంట్ శివనాగిరెడ్డి.. మంత్రి, దాజికి వివరించారు. బుద్ధవనం సందర్శనకు ఆసియా ఖండంలోని పలు దేశాల నుంచి బౌద్ధులు రానున్నారని, వారు బస చేసేందుకు సకల సౌకర్యాలతో హోటల్ నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం నాగార్జునసాగర్ చుట్టు పక్కలగల ప్రభుత్వ భూములపై సర్వే నిర్వహించి వివరాలు అందజేయాలని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్‌ను ఆదేశించారు.

ప్రపంచ పర్యాటక కేంద్రంగా సాగర్ : ఎమ్మెల్యే నాగార్జునసాగర్‌ను ప్రపంచ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి తెలిపారు. బుద్ధవనం సందర్శన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొండలు, గుట్టలతో కూడిన పరిసరాలు, కృష్ణానది తీరం, నీటి సౌకర్యం ఉందని హైదరాబాద్‌కు అతిసమీపంలో ఉన్నందున స్టార్ హోటల్‌తో పాటు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా కాటేజీల నిర్మాణం చేయాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధిసంస్థ ఓఎస్డీ సూధన్‌రెడ్డి, బుద్ధవనం డిజైనర్ శ్యాంసుందర్, సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్, ఏఎస్పీ రాములునాయక్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

కోదాడ డీఎస్పీకి దక్షతా పురస్కారం

- నేరపరిశోధనలో చూపిన ప్రతిభకు గుర్తింపు



శ్రీధర్‌రెడ్డి

కోదాడ: కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి నేర పరిశోధనతో పాటు వివిధ రంగాల్లో చూపిన ప్రతిభకు గుర్తింపుగా ఆయనకు కేంద్ర హోం మంత్రిత్వశాఖ 2024 సంవత్సరానికి 'కేంద్ర హోం మంత్రి దక్షతా పురస్కారం' ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఆ శాఖ ప్రకటన విడుదల చేసింది. 1998లో ఎస్ఐగా డిపార్ట్‌మెంట్‌లో చేరిన శ్రీధర్ రెడ్డి, కోదాడ ఎస్ఐగా, కోదాడ పట్టణ సీఐగా చేశారు. ప్రస్తుతం కోదాడ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. 2016-17లో ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణ దళంలో చేరి హైతీ దేశంలో పోలీస్ ప్లానింగ్ అధికారిగా పనిచేశారు. 2019లో హాజీపూర్‌లో జరిగిన ముగ్గురు బాలికల హత్య ఘటనలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడిని పట్టుకోవడంలో ఆయన కీలకంగా పనిచేశారు. మునగాల మండలం నర్సింహులగూడేనికి చెందిన వ్యక్తి కోదాడ పట్టణ పరిధిలో హత్యకు గురికాగా.. ఈ కేసులో కారు స్టీరింగ్ మీద నిందితుడి రక్త మరకలు గుర్తించి, దాని ఆధారంగా అతడికి శిక్ష పడేలా చేశారు. ఇలా అనేక కీలక కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితులను పట్టుకోవడంతో ఆయనకు ఈ పురస్కారం దక్కింది. గతంలో పోలీస్ సేవా పతకాన్ని, తెలంగాణ రాష్ట్ర శౌర్య పతకాన్ని అందుకున్నారు. 2015లో పంజాబ్‌లో జరిగిన అఖిల భారత స్థాయి డ్యూటీ మీట్ ఫోరెనిక్స్ విభాగంలో రజత పతకం పొందారు. పోలీస్ విభాగంలో చేసిన సేవలకు గాను స్వాతంత్ర్య దినోత్సవం రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ పతకాన్ని శ్రీధర్‌రెడ్డికి బహూకరించారు. కేంద్ర హోం మంత్రి దక్షిత పతకానికి ఎంపికైన కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డిని డీజీపీ జితేందర్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, ఏఎస్పీ నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు.

అంగన్‌వాడీ కొలువుపై ఆశలు

- జిల్లాలో 162 టీచర్లు, 595 హెల్పర్ పోస్టులు ఖాళీ
- పూర్తిస్థాయిలో అందని సేవలు
- నియామకాలు చేపడతామని ప్రకటించిన ప్రభుత్వం



మిర్యాలగూడ టౌన్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్, హెల్పర్ పోస్టులను భర్తీ చేస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించడంతో నిరుద్యోగ మహిళల్లో ఆశలు చిగురిస్తున్నాయి. చిన్నారులకు ఆటా-పాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను అందించడం, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు అవసరమైన ఆరోగ్య సలహాలను ఇవ్వడానికి అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. చాలా చోట్ల అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టులు ఎంతో కాలంగా ఖాళీగా ఉన్నాయి. గత ప్రభుత్వం వివిధ కారణాలతో వాటిని భర్తీ చేయలేదు. టీచర్లున్న ఉన్న చోట హెల్పర్లు లేకపోవడం, హెల్పర్లు ఉన్న చోట టీచర్లు లేకపోవడం ల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పోస్టుల ఖాళీగా ఉండడంతో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ లక్ష్యం నేరవేరడం లేదు. ఖాళీలను భర్తీ చేస్తే అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతమయ్యే అవకాశాలున్నాయి.

జిల్లాలో తొమ్మిది ప్రాజెక్టులు..

నల్లగొండ జిల్లాలో అనుముల, చింతపల్లి, దామరచర్ల, కొండమల్లేపల్లి, దేవరకొండ, మునుగోడు, మిర్యాలగూడ, నకిరేకల్, నల్లగొండ తొమ్మిది ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో మొత్తం 2,093 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల పరిధిలో 85,788 మంది పిల్లలు, 8,771 మంది గర్భిణులు, బాలింతలు 8,418 మంది ఉన్నారు. ఇందులో కొంత మంది పదోన్నతులు పొందగా మరికొంత మంది రిటైర్మెంట్ కావడంతో.. జిల్లాలో 162 టీచర్, 595 హెల్పర్ పోస్టులు భర్తీ కావాల్సి ఉంది.

సేవల్లో అంతరాయం..

పోస్టులు ఖాళీగా ఉండడంతో పిల్లల బరువులు, ఎత్తులు చూడటంతో పాటు ఆయా వివరాలు నమోదు చేయడం సమస్యగా మారింది. పిల్లలకు పూర్వప్రాథమిక విద్యను బోధించడం లేదు. గర్భిణులు, బాలింతలకు కౌన్సిలింగ్ ఇవ్వడం, ఇంటింటికి వెళ్లి వివరాలను నమోదు చేయడం వంటి కార్యక్రమాలు నామమాత్రంగా సాగుతున్నాయి. న్యూ హెల్త్ ట్రాకింగ్ సిస్టం (ఎన్‌హెచ్‌టీఎస్) పోషణ ట్రాకర్, రిజిస్టర్ల వివరాలు నమోదు చేయడంలో సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందం లేదు.

ఖాళీలు ఇలా..

ప్రాజెక్టు	టీచర్లు	హెల్పర్లు
అనుముల	19	61
చింతపల్లి	32	48
దామరచర్ల	08	88
కొండమల్లేపల్లి	26	59
దేవరకొండ	34	88
మునుగోడు	07	47
మిర్యాలగూడ	14	49
నకిరేకల్	09	73
నల్లగొండ	13	82

రోస్టర్ తయారు చేస్తున్నాం



జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, హెల్పర్ పోస్టుల భర్తీకి సంబంధించిన గైడ్ లైన్స్ వచ్చాయి. టీచరు పోస్టులు ఖాళీగా ఉన్న చోట ఇంటర్మీడియేట్ పాస్ అయి.. అదే వార్డు, అదే గ్రామ పంచాయతీ నివాసం ఉన్న హెల్పర్లకు ప్రమోషన్లు ఇచ్చే అంశంపై పరిశీలించి నివేదికను తయారు చేస్తాం. పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత భర్తీ కోసం అప్రూవల్ తీసుకుంటాం. అంగన్‌వాడీ ఖాళీలు ఉన్నా.. ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– కృష్ణవేణి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి

క్లుప్తంగా

టీటీడీ పాలకవర్గ సభ్యుడిగా సిరిపురం వాసి


నన్నూరి నర్సిరెడ్డి

రామన్నపేట : తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యుడిగా రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన నన్నూరి నర్సిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు రోజుల క్రితం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. సిరిపురం గ్రామానికి చెందిన నన్నూరి అంజిరెడ్డి–ఉత్తరమ్మలది వ్యవసాయ కుటుంబం. వారి పెద్ద కుమారుడు నర్సిరెడ్డి తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడిగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశాడు. ప్రస్తుతం టీడీపీ జాతీయ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నాడు. తమ గ్రామానికి చెందిన వ్యక్తి టీడీపీ పాలకమండలి సభ్యుడుగా నియామకం కావడం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వరకట్న వేధింపులు.. కేసు నమోదు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : పెళ్లయిన ఆరు నెలల అనంతరం అదనపు కట్నం తీసుకురావాలంటూ వేధింపులకు గురి చేస్తుండడంతో మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన షేక్ రేష్మాను ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం చిరుమర్ గ్రామానికి చెందిన షరీఫ్‌కు ఇచ్చి 13 నెలల క్రితం వివాహం చేశారు. ఆరు నెలలు వారి సంసారం సాఫీగా సాగింది. ఆ తర్వాత అదనపు కట్నం తీసుకురావాలని అత్తారింటివారు రేష్మాను వేధింపులకు గురి చేయసాగారు. రేష్మ ఫిర్యాదు మేరకు శుక్రవారం షరీఫ్‌తోపాటు షరీఫ్ తల్లిదండ్రులు, అక్కలపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రత్నావత్ శంకర్‌నాయక్ తెలిపారు.

పాత కక్షలతో దాడి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : పాత కక్షలు మనసులో పెట్టుకొని ఒక ఇంటిపై దాడి చేసి ఇంట్లోవారిని గాయపరిచి గృహోపకరణాలను ధ్వంసం చేసిన సంఘటన చింతలపాలెం మండలంలోని పీక్లానాయక్ తండాలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. శుక్రవారం ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పీక్లానాయక్ తండాకు చెందిన ఎ చందు, బి.శివతోపాటు కొంతమందితో కలిసి పాత కక్షలు మనసులో పెట్టుకొని దీపావళి టపాసులు ఇంటి ఎదుట కాలుస్తున్నారనే నెపంతో భూక్య రవీందర్, భూక్య రఘు ఇళ్లపై దాడి చేశారు. ఈ దాడిలో రవీందర్ ఇంటిలోని కారు, గృహోపకరణాలు ధ్వంసమయ్యాయి. అనంతరం రఘు ఇంటిపై దాడి చేసి గృహోపకరణాలను ధ్వంసం చేసి రఘుపై, కుటుంబ సభ్యులపై కూడా దాడి చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. భూక్య రఘు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచగా వారిపై కేసు నమోదు చేసినట్లు ఆత్మకూర్ (ఎస్) పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం కుడకుడ గ్రామానికి చెందిన దండుగల మహేష్‌కు సూర్యాపేట రూరల్ మండలంలోని టేకుమట్లకు చెందిన మేకల రమేష్, పల్లెల రమేష్‌తో పాత కక్షలు ఉన్నాయి. కాగా గురువారం దీపావళి పండుగ సందర్భంగా ఆత్మకూర్ (ఎస్) మండలం నెమ్మికల్లు గ్రామంలో మటన్ తీసుకెళ్లడానికి మహేష్ వచ్చాడు. సమాచారం తెలుసుకున్న మేకల రమేష్, పల్లెల రమేష్, పసుపుల చంద్రయ్యతోపాటు మరో ఐదుగురు నెమ్మికల్లుకు వచ్చి దండుగల మహేష్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో మహేష్‌కు తీవ్ర గాయాలు కాగా సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మహేష్ ఫిర్యాదు మేరకు దాడి చేసిన 8 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రత్నావత్ శంకర్‌నాయక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

- చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం స్టేజీ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- కారును వెనుక నుంచి ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
- న్యాయవాది నర్సింహారెడ్డి ఆయన భార్య అక్కడికక్కడే మృతి


రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారులో మృతదేహాలు

చౌటుప్పల్ రూరల్, నకిరేకల్ : మండలంలోని దండు మల్కాపురం స్టేజీ వద్ద జాతీయ రహదారి–65పై బుధవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న కారును వెనకనుంచి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో కారులో ఉన్న దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఇప్పలగూడెం గ్రామానికి చెందిన బొబ్బలి నర్సింహారెడ్డి(63), అతడి భార్య సరోజిని (57) ఇరవై ఏళ్లుగా నకిరేకల్‌లో స్థిర నివాసం ఏర్పరచుకుని ఉంటున్నారు. డ్రైవర్‌ను తీసుకుని తమ కారులో హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో జరిగిన పుట్టిన రోజు వేడుకలకు వెళ్లి నకిరేకల్‌కు తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో దండు మల్కాపురం గ్రామ స్టేజీ వద్ద ఉన్న దాబా సమీపంలో కారును రోడ్డు పక్కన ఆపారు. ఈ సమయంలో హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. నర్సింహారెడ్డి సరోజిని కారులో ఇరుక్కుపోయి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ మహేష్ తీవ్రంగా గాయపడ్డాడు. బస్సు ముందు భాగంలో కారు ఇరుక్కుపోవడంతో క్రెయిన్ సహాయంతో మృతదేహాలను బయటకు తీశారు. మహేష్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నర్సింహారెడ్డి, సరోజిని మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుమారుడు విదేశాల్లో ఉండడంతో ఆయన వచ్చేవరకు మృతదేహాలను నకిరేకల్ ఏరియా ఆస్పత్రిలోని మర్చ్యురీ గదిలో భద్రపరిచారు. శుక్రవారం ఉదయం మృతదేహాలను నకిరేకల్‌లోని పటేల్‌నగర్‌లో వారి స్వగృహానికి తీసుకెళ్లారు. ఈ ప్రమాదంపై మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.


నర్సింహారెడ్డి,సరోజిని(ఫైల్)

చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న బొబ్బలి నర్సింహారెడ్డి ఆయన భార్య రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలుసుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హుటాహుటిన చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. నర్సింహారెడ్డి దంపతుల మృతదేహాలకు నివాళులర్పించారు. మృతదేహాలకు పోస్ట్‌మార్టం నిర్వహించే వరకు ఆస్పత్రిలోనే ఉన్నారు.

నకిరేకల్‌లో ఇరవై ఏళ్ల నుంచి స్థిర నివాసం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బొబ్బలి నర్సింహారెడ్డి స్వగ్రామం కేతేపల్లి మండలం ఇప్పలగూడెం. ఇరవై ఏళ్ల క్రితమే నకిరేకల్‌లో స్థిరపడ్డారు. నర్సింహారెడ్డి స్థానిక మున్సిఫ్ కోర్టులో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం చేస్తూ ఐదేళ్ల క్రితం పదవీ విరమణ పొందారు. అనంతరం న్యాయవాద కోర్సు పూర్తి చేసి తాను పనిచేసిన నకిరేకల్ మున్సిఫ్ కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఆయన భార్య సరోజిని గృహిణి. వీరికి ఒక కుమారుడు, కుమార్తె. వీరు అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారు.

కడసారి చూసుకోలేని కూతురు

నర్సింహారెడ్డి–సరోజినిలను చివరిసారిగా చూసుకోవడానికి వారి కూతురు అమెరికా నుంచి రాలేకపోయింది. కూతురు అశ్విని ప్రస్తుతం ఎనిమిది నెల గర్భిణి కావడంతో విమానంలో ప్రయాణానికి అనుమతి లేకపోవడంతో అక్కడే ఉండిపోయింది. అమెరికాలో ఉన్న నర్సింహారెడ్డి కుమారుడు రాకేష్ తన భార్యతో కలిసి శుక్రవారం తెల్ల వారుజామున నకిరేకల్‌కు వచ్చారు. ఇక మృతుడు నర్సింహారెడ్డి తల్లి ప్రస్తుతం 95 ఏళ్లపైనే వృద్ధాప్యంలో నకిరేకల్‌లో తన కుమార్తె వద్ద ఉంటోంది. ఆమె ఆరోగ్య పరిస్థితి సహకరించకపోవడంతో కొడుకు, కోడలు మరణ వార్త తెలపకుండా తీసుకువచ్చారు. తన కొడుకు, కోడలు మృతదేహాలు కళ్ల ఎదుట కనిపించినా వారిని గుర్తుపట్టే స్థితిలో ఆమె లేదు.

అశ్రునయనాల మధ్య దంపతుల అంత్యక్రియలు

కేతేపల్లి: చౌటుప్పల్ మండలం మల్కాపూర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కేతేపల్లి మండలంలోని ఇప్పలగూడెం గ్రామానికి చెందిన అడ్వకేట్ బొబ్బల నర్సింహారెడ్డి–సరోజిని దంపతుల మృతదేహాలకు శుక్రవారం వారి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. వారి కుమారుడు, కూతురు అమెరికాలో ఉండడంతో మృతదేహాలకు గురువారం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలోని ఫ్రీజర్ బాక్స్‌లలో ఉంచారు. కుమారుడు వచ్చిన అనంతరం దంపతుల మృతదేహాలను నకిరేకల్ పట్టణం నుంచి శుక్రవారం ఉదయం 10 గంటలకు ఇప్పలగూడెం గ్రామానికి తీసుకువచ్చారు. దంపతుల మృతదేహాలను కడసారి వీక్షించేందుకు సహచర అడ్వకేట్లు, ఇప్పలగూడెం గ్రామంతోపాటు మండలంలోని పలు గ్రామాల నుంచి జనం భారీ సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎన్‌డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నేత దైద రవీందర్ ఇప్పలగూడెంలో నర్సింహారెడ్డి–సరోజిని దంపతుల మృతదేహాలపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మృతుల బంధువులు, కుటుంబ సభ్యులు గ్రామస్తుల అశ్రునయనాల మధ్య దంపతుల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు పెరుమాళ్ల శేఖర్, స్వర్ణలతసురేష్, వివిధ రాజ కీయ పార్టీల నాయకులు పూజర్ల శంభయ్య, ఉందర్, గుత్త మాధవరెడ్డి, జి.రవీందర్‌రెడ్డి, వెంకటనర్సయ్య, ఎ.మహేందర్‌రెడ్డి, ఎస్‌కే.లతీఫ్, సంజీవరెడ్డి, మట్టి సాల్మన్, బీరం జాన్‌రెడ్డి, ఎం.ప్రవీణ్‌రెడ్డి, ఎడ్ల ప్రవీణ్, ఎ.అంజన్‌కుమార్‌యాదవ్, గుండగాని వెంకన్న, ఎ.జగన్నాదం ఉన్నారు.


నర్సింహారెడ్డి–సరోజిని మృతదేహాల వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి , ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం

డ్రగ్స్ ముఠా అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

- రూ.18 లక్షల విలువైన డ్రగ్స్, కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం
- హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తుండగా పట్టుకున్న చౌటుప్పల్ పోలీసులు


పోలీసులు పట్టుకున్న డ్రగ్స్ ప్యాకెట్లు

చౌటుప్పల్ రూరల్: డ్రగ్స్ సరఫరా చేస్తున్న రాజస్తాన్‌కు చెందిన వ్యక్తులను చౌటుప్పల్ పోలీసులు పట్టుకున్నారు. వారిని అరెస్ట్ చేసి డ్రగ్స్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు ఇద్దరు వ్యక్తులు డ్రగ్స్ రవాణా చేస్తున్నారని ఎస్‌ఐ లక్ష్మయ్యకు పక్కా సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి పంతంగి టోల్‌ప్లాజా వద్ద నిఘా పెట్టారు. విజయవాడ వైపు వెళ్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో ఓ మారుతి స్విఫ్ట్ కారును ఆపారు. అందులో అక్రమంగా తరలిస్తున్న డ్రగ్స్ దొరికింది. రాజస్థాన్‌కు చెందిన చైల్ సింగ్(30), సుమార్ సింగ్(28) అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా.. హైదరాబాద్‌లో తెలిసిన వ్యక్తి నుంచి 102 గ్రాముల ఎండీఎంఏ, ఎన్‌డీపీఎస్ డ్రగ్స్‌ను కొనుగోలు చేసి విజయవాడలో విక్రయించడానికి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. సులభంగా డబ్బు సంపాదించడానికి డ్రగ్స్ సరాఫరా చేస్తున్నారని విచారణలో వెల్లడయినట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.18 లక్షల విలువైన డ్రగ్స్, కారు, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మన్మథ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మృతిచెందిన శ్రీనివాస్‌రెడ్డి

వేములపల్లి : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన గురువారం వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. సూర్యాపేట జిల్లా పానుగోడు గ్రామానికి చెందిన గున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి(33) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. దీపావళి పండుగ సందర్భంగా బుధవారం సాయంత్రం మిర్యాలగూడ పట్టణంలోని తన అత్తగారింటికి భార్య, పిల్లలతో వచ్చాడు. గురువారం ఉదయం వేములపల్లి మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్న తన అక్క ఇంటికి మిర్యాలగూడ పట్టణం నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో శెట్టిపాలెం శివారులోని నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై గల లక్ష్మీగణపతి మిల్లు వద్దకు రాగానే అదే సమయంలో మిర్యాలగూడ నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న లారీ.. శ్రీనివాస్‌రెడ్డి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌రెడ్డికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.

ప్రాణాలు తీసిన వడ్ల రాశి


మృతి చెందిన నాగరాజు

చివ్వెంల(సూర్యాపేట) : రోడ్డుపై పోసిన ధాన్యం రాశిని తప్పించబోయి బైక్ అదుపు తప్పి పల్టీ కొట్టడంతో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన చివ్వెంల మండల కేంద్రం శివారులోని ఖమ్మం–సూర్యాపేట సర్వీస్ రోడ్డుపై గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండలం తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన పిడమర్తి నాగరాజు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం దీపావళి పండుగ సందర్భంగా చివ్వెంల మండలంలోని బి.చందుపట్ల గ్రామంలోని అత్తగారింటికి బైక్‌పై వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా మార్గమధ్యలో మండల కేంద్రం శివారులో సూర్యాపేట–ఖమ్మం సర్వీస్ రహదారిపై ఓ రైతు పోసిన ధాన్య రాశిని తప్పించబోయి బైక్ అదుపు తప్పి పల్టీ కొట్టింది. నాగరాజు బైక్ పైనుంచి కిందపడడంతో పక్కనే ఉన్న డివైడర్‌కు తల బలంగా తగిలి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు, మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటరత్నం కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి 8 నెలల క్రితమే వివాహం జరిగింది. పోస్టుమార్టం అనంతరం నాగరాజు మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

మహిళపై అత్యాచార యత్నం

- అవమాన భారంతో పురుగుల మందు తాగిన వివాహిత
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

వేములపల్లి : వివాహితపై ఓ పార్టీకి చెందిన నాయకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. అవమాన భారంతో ఆ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. వేములపల్లి మండలం లక్ష్మీదేవిగూడెం గ్రామానికి చెందిన ఎస్టీ మహిళ ఇంట్లో ఉండగా గత నెల 21న రాత్రి సమయంలో అదే గ్రామానికి చెందిన గంటా కృష్ణయ్య అనే వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. కర్ర తీసుకుని కొట్టి చంపుతానని బెదిరించడంతో ఆ మహిళ కేకలు వేయడంతో ఇరుగుపొరుగువారు రావడంతో కృష్ణయ్య పరారయ్యాడు. దీంతో ఆ మహిళ అవమాన భారంతో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలిని వెంటనే బంధువులు సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో మరొక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యుల సలహా మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. గత నెల 22న ఈ విషయంపై బాధితురాలి మామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన కోడలిపై అత్యాచారయత్నానికి పాల్పడి చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.

టపాసులు కాల్చుతుండగా ప్రమాదం

- బైక్ సర్వీస్ సెంటర్‌లో నిప్పురవ్వలు పడి వస్తువులు దగ్ధం

సూర్యాపేటటౌన్: కొంతమంది యువకులు దీపావళి టపాసులు కాల్చుతుండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న బైక్ షోరూం సర్వీస్ సెంటర్‌లో నిప్పురవ్వలు పడి సామగ్రి దగ్ధమైన సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుడు రుస్తుం అలీ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హైవే సమీపంలోగల విద్యానగర్‌లో రుస్తుం అలీ ఏ వన్ హీరో హోండా షోరూం సర్వీస్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. కాగా గురువారం రాత్రి కొంతమంది టపాసులు కాల్చుతుండగా ఒక్కసారిగా షాపులో నిప్పురవ్వలు పడి సర్వీస్ సెంటర్‌లో ఉన్న సుమారు రూ.2లక్షల విలువైన స్పేర్ పార్ట్స్ దగ్ధమయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి రుస్తుం అలీకి ఫోన్ చేయగా వర్కర్స్‌తో వెళ్లి మంటలను ఆర్పారు. ఆ తర్వాత ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయడంతో వారు కూడా వచ్చి పంచనామా చేసి వెళ్లారని, ఈ విషయమై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని రుస్తుం అలీ వివరించాడు.


సర్వీస్ సెంటర్‌లో దగ్ధమైన సామగ్రి

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

నేరేడుచర్ల : ప్రమాదవశాత్తు చింతచెట్టు పైనుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం నేరేడుచర్ల మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామానికి చెందిన ఊదర నాగరాజు(41) అనే వ్యక్తి దుబ్బలమీద ఉన్న చింతచెట్టుకు ఉన్న చింతకాయలు కోసేందుకు చెట్టుపైకి ఎక్కాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య హైమావతి, పిల్లలు మానస, అనిల్ ఉన్నారు. నాగరాజు మృతదేహాన్ని సీపీఐ నాయకులు ధనుంజయ నాయుడు, చిలకరాజు శ్రీను, ఉదర వెంకన్న, వెంకట్, భరత్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

బావిలో పడి..

కోదాడ: రెడ్లకుంట గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని వ్యక్తి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లెల రామారావు కుమారుడు పాపారావు (29) కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో చికిత్స చేయించారు. శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన పాపారావు.. సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఒకరు గమనించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. తండ్రి రామారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

మూసీలో పడి ఇద్దరు విద్యార్థులు మృతి


మృతుడు కల్లెం జీవన్ (ఫైల్)


మృతుడు కల్లెం కిరణ్ (ఫైల్)

వలిగొండ : చేపల వేటకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు ప్రమాదవశాత్తు మూసీ నదిలో పడి మృతిచెందిన ఘటన వలిగొండ మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండల కేంద్రంలోని జంగాల కాలనీలో నివాసముంటున్న ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ముల పిల్లలు కల్లెం స్వామి–సువర్ణ దంపతుల కుమారుడు కిరణ్(11)ఐదో తరగతి, కల్లెం దశరథ–అలివేల దంపతుల కుమారుడు జీవన్ (13) ఆరో తరగతి, కల్లెం సత్తయ్య–పారిజాత దంపతుల కుమారుడు వరుణ్ కలిసి మూసీ నదిలో చేపలు పట్టడానికి వెళ్లారు. మూసీ నది ఒడ్డున చేపలు పడుతుండగా కిరణ్ ప్రమాదవశాత్తు జారి నీళ్లల్లో పడి కొట్టుకుపోయాడు. అతడిని రక్షించడానికి జీవన్ నీళ్లలోకి దూకాడు. ఇద్దరూ మునిగి పోతుండడాన్ని గమనించిన వరుణ్.. పరిగెత్తుకుంటూ వచ్చి కుటుంబ సభ్యులకు, కాలనీవాసులకు సమాచారం అందించాడు. వారు హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. స్థానికుల సమాచారం మేరకు స్థానిక ఎస్‌ఐ యుగంధర్, రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘటనా స్థలానికి చేరుకుని మూసీ నీటిలో వెతకగా కిరణ్ మృతదేహం లభ్యమైంది. జీవన్ ఆచూకీ తెలియరాలేదు. పోలీసులు శుక్రవారం ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టగా జీవన్ మృతదేహం లభ్యమైంది. ప్రమాద సమాచారం తెలుసుకున్న జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వీరారెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాలకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

సాగర్ ఎడమ కాలువలో పడి కార్మికుడు గల్లంతు

- నేరేడుచర్ల మండలం మేడారం వద్ద మృతదేహం లభ్యం


గల్లంతైన హరికృష్ణ(ఫైల్)

మిర్యాలగూడ టౌన్ : నాగార్జున సాగర్ ఎడమ కాలువలో పడి కార్మికుడు గల్లంతైన సంఘటన గురువారం మిర్యాలగూడ మండలంలో చోటుచేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ పిల్లి లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం తక్కెళ్లపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని బండమీదిగూడెంకు చెందిన నారబోయిన హరికృష్ణ(37) త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామంలో గల రెడ్డీస్ ల్యాబ్‌లో దినసరి కార్మికుడిగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే డ్యూటీకి వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు తక్కెళ్లపాడు గ్రామ శివారులోని సాగర్ ఎడమ కాలువ కట్టపై తన ద్విచక్రవాహనం నిలిపాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోవడంతో ఈత రాక హరికృష్ణ గల్లంతై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. తమ కుమారుడు డ్యూటీ నుంచి ఇంటికి తిరిగి రాకపోవడంతో శుక్రవారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అనంతరం కాలువ కట్టపై కుటుంబ సభ్యులు హరికృష్ణ కోసం వెతికారు. ద్విచక్ర వాహనంతో పాటు చెప్పులు కనబడడంతో కాలువ వెంట గాలిస్తుండగా సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం మేడారం వద్ద హరికృష్ణ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తండ్రి వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చీటీల పేరుతో ఘరానా మోసం!

నాగార్జునసాగర్: చీటీల పేరుతో ఘరానా మోసానికి పాల్పడిన సంఘటన నందికొండలోని పైలాన్‌కాలనీలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పాదన కేంద్రంలో పనిచేసే ఓ ఉద్యోగి 2021 నుంచి చీటీల వ్యాపారం చేస్తున్నాడు. జెన్‌కోలో పనిచేసే ఉన్నత స్థాయి ఇంజనీర్లతోపాటు దిగువ స్థాయి ఉద్యోగులు ఇతడి దగ్గర లక్ష రూపాయల నుంచి రూ.5లక్షల వరకు చీటీలు వేస్తున్నారు. చీటీలు కట్టడం పూర్తయిన తర్వాత అవసరం ఉన్నవారు డబ్బులు అడిగితే రేపు, మాపంటూ కాలయాపన చేస్తున్నట్లు బాధితులు తెలిపారు. గట్టిగా నిలదీయడంతో మూడేళ్ల నుంచే చాలామందికి ప్రామిసరీ నోట్లు రాసిచ్చినట్లు తెలిసింది. మూడు రోజులుగా ఉద్యోగి కనపడకుండా పోయేసరికి బాధితులు పోలీసులను ఆశ్రయించారు. శుక్రవారం రాత్రి పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్‌ఐ సంపత్‌ను వివరణ కోరగా.. చీటీలు నడిపే వ్యక్తిపై ఫిర్యాదులు ఇంకా రాలేదనితెలిపారు.

యువకుడు అదృశ్యం


లతీఫ్(ఫైల్)

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట) : ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోవడంతో.. అతడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ శంకర్‌నాయక్ తెలిపారు. వివరాలు.. ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని కోటపహడ్ గ్రామానికి చెందిన షేక్ లతీఫ్ (23) గ్రామంలో వ్యవసాయ కూలీగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. లతీఫ్‌కు ఇద్దరు సోదరులు ఉన్నారు. తల్లిదండ్రులు ఐదు సంవత్సరాల క్రితం మృతి చెందారు. ఒక సోదరుడు సూర్యాపేటలో, మరో సోదరుడు కుటుంబంతో అదే గ్రామంలో నివాసం ఉంటున్నారు. లతీఫ్ అవివాహితుడు కావడంతో ఒక్కడే గ్రామంలోని పాత ఇంట్లో ఉంటున్నాడు. కాగా గత నెల 29న తనకు డబ్బులు అవసరం ఉన్నాయని లతీఫ్ సోదరుడు మహబూబ్‌అలీని కోరగా సూర్యాపేటకు వచ్చి తీసుకెళ్లమని చెప్పాడు. అదేరోజు సాయంత్రం బయటికి వెళ్లిన లతీఫ్ ఆచూకీ లేకపోవడంతో బంధువుల ఇళ్లలో, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో మహబూబ్ అలీ గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ శంకర్‌నాయక్ తెలిపారు.

సాగర్ వెనుక జలాల్లో మునిగి వ్యక్తి దుర్మరణం

చందంపేట : మండలంలోని వైజాక్ కాలనీలో సాగర్ వెనుక జలాల్లో మునిగి వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలానికి చెందిన మహమ్మద్ పాషా(40) బుధవారం ఉదయం విహార యాత్ర కోసం వైజాక్ కాలనీకి ఆరుగురు స్నేహితులతో కలిసి వచ్చాడు. అక్కడ బోట్లలో కాసేపు తిరిగి వస్తుండగా ఈత కొట్టేందుకు మహ్మద్ పాషా నీటిలో దూకడంతో మునిగిపోయాడు. దీంతో స్నేహితులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బుధ, గురు వారాల్లో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండాపోయింది. శుక్రవారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు చేపట్టగా మహమ్మద్ పాషా మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

ఎడమ కాల్వలో పడి వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం

హాలియా : కన్న కొడుకులు తన ఆలనాపాలన పట్టించుకోకపోవడంతో తీవ్ర మనస్థాపం చెందిన ఓ వృద్ధురాలు సాగర్ ఎడమ కాల్వలో పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన హాలియా పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండల కేంద్రానికి చెందిన ఊరే ముత్తమ్మ (70) అనే వృద్ధురాలికి భర్త కొండయ్య మృతి చెందడంతో అడపాదడపా కూలి పనులకు వెళ్తూ ఆసరా పింఛన్‌తో జీవనం సాగిస్తోంది. ముత్తమ్మకి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల ముత్తమ్మకి రెండు కాళ్లు విరిగాయి. ఇద్దరు కుమారులు ఆమె ఆలనాపాలన పట్టించుపోవడం లేదు. దీంతో తీవ్ర మనస్థాపం చెంది శుక్రవారం హాలియా వద్ద ఉన్న ఎడమ కాల్వ వద్దకు వచ్చి కాల్వలోకి దూకింది. కాల్వ సమీపంలోనే ఉన్న యువకులు గమనించి ఆమెను రక్షించి బయటకు తీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలం వద్దకు చేరుకుని చికిత్స నిమిత్తం ఆమెను 108 వాహనంలో నాగార్జున సాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌కు ఎలాంటి ఫిర్యాదు రానందున కేసు నమోదు కాలేదని, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.